జిల్లాలో సెక్షన్ 30 అమలు : ఎస్‌పి

ప్రజాశక్తి - అమలాపురం

జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 అమల్లో ఉందని, నిరసనలు, ధర్నాలకు, బంద్‌కు అనుమతి లేదని ఎస్‌పి ఎస్.శ్రీధర్ తెలిపారు. టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎసిబి కోర్టు రిమాండ్‌ను నిరసిస్తూ టిడిపి రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిందన్నారు. దీనికి అనుమతి లేదన్నారు. జిల్లాలో బస్సుల రవాణాకు ఆటంకాలు, నిరసనలకు, ధర్నాలకు అనుమతి లేదన్నారు. పాఠశాలలు, కళాశాలలు, వ్యాపార సముదాయాలను బలవంతంగా మూయిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజల సాధారణ జన జీవనం, రాకపోకలకు బలవంతంగా ఎలాంటి అసౌకర్యం కలిగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్ల పైకి వచ్చి అల్లర్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నిర్బంధాల నడుమ బంద్

ప్రజాశక్తి - యంత్రాంగం

మాజీ సిఎం చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి ఇచ్చిన రాష్ట్ర బంద్ టిడిపి, జనసేన నేతల పోలీసు నిర్బంధాల మధ్య సోమవారం ప్రశాంతంగా జరిగింది. నగర, మున్సిపల్ కేంద్రాల్లో బంద్ పాక్షికంగా జరగగా, మండల కేంద్రాల్లో బంద్ సంపూర్ణంగా జరిగింది. ఆయా పార్టీలకు చెందిన ముఖ్య నేతలను ముందస్తుగానే హౌస్ అరెస్టులతోనూ, పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడంతో ద్వితీయ శ్రేణి నాయకత్వం ఆధ్వర్యంలో బంద్ జరిగింది. ప్రభుత్వ విద్యా సంస్థలు, కార్యాలయాలను ఆందోళనకారులు బంద్ చేయించగా, ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు ముందస్తుగానే ఆయా సంస్థలకు శెలవును ప్రకటించాయి. వివిధ వ్యాపార సంస్థల యాజమాన్యాలు స్వచ్ఛంధంగానే దుకాణాలను మూసివేసి బంద్‌కు మద్దతు ప్రకటించాయి. అయితే ఎపిఎస్ఆర్‌టిసి బస్సు సర్వీసులు పాక్షికంగా తిరిగాయి **అమలాపురంలో** చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి, జనసేన నాయకులు ధర్నా నిర్వహించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబెడ్కర్ కోనసీమ జిల్లా వ్యాప్తంగా వాణిజ్య వ్యాపార సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. విద్యాసంస్థలకు ముందుగానే సెలవు ప్రకటించారు. అమలాపురం బులియన్ మార్కెట్ స్వచ్ఛంద బందుకు పిలుపునిచ్చి షాపులు మూసివేశారు. పోలీసు భద్రత నడుమ ఆర్టీసీ బస్సులు పాక్షికంగా నడిచాయి. జనసేన నేతలు డిఎంఆర్ శేఖర్, శెట్టిబత్తుల రాజబాబులను హౌస్ అరెస్ట్ చేశారు..అమలాపురం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి శెట్టిబత్తుల రాజబాబు అమలాపురం పార్లమెంటు ఇంచార్జ్ డిఎంఆర్.శేఖర్‌ని సోమవారం తెల్లవారుజామునే హౌస్ అరెస్ట్ చేశారు. రోడ్లు పైకి వచ్చిన పట్టణ టిడిపి కార్యదర్శి భాస్కర్ల రామకృష్ణతో పాటు పది మంది కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని అమలాపురం రూరల్ స్టేషన్‌కు తరలించారు. బస్టాండ్ వద్ద బస్సులను అపి ధర్నా నిర్వహిస్తున్న టిడిపి పట్టణ అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీసుభాష్‌చంద్రబోస్‌ను నాయకులను అరెస్టు చేసి ఉప్పలగుప్తం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎంఎల్‌ఎ అయితాబత్తుల ఆనందరావు, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు ఆధ్వర్యంలో షాపులను మూయించారు. **కొత్తపేట** మండలంలో బంద్ విజయవంతమైంది. వాణిజ్య, విద్యాసంస్థలు, ప్రభుత్వ రంగ కార్యాలయాలు, బ్యాంకులను స్వచ్ఛందంగా మూసివేశారు టిడిపి మండల అధ్యక్షుడు కంఠంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నాయకులు బండారు సంజీవ్, ముత్యాల బాబ్జి, అన్యం మునీశ్వరరావు, ముద్రగడ సుబ్బారావు, బాబు, బూసి విష్ణుమూర్తి, ముత్యాల రాజు బంద్‌లో పాల్గొన్నాయి. బంద్‌కు జనసేన మద్దతు తెలిపింది. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ బంద్‌లో పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం** మండలంలో టిడిపి, జనసేన పార్టీ నాయకులు ఆధ్వర్యంలో బంద్‌ను నిర్వహించారు. అన్ని ప్రభుత్వ, ప్రయివేటు వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలను మూయించేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు. **ఆలమూరులో** 18 గ్రామాల్లో బంద్ స్వచ్ఛందంగా నిర్వహించారు. పలుచోట్ల టిడిపి శ్రేణులు వాణిజ్య సంస్థలను మూయించేశారు. పలుచోట్ల టిడిపి నాయకులు నిరసనలు తెలిపారు. **మామిడికుదురులో** బంద్ ప్రశాంతంగా జరిగింది. పాశర్లపూడి, మామిడికుదురు సెంటర్లలో వ్యాపార సముదాయాలు మూయించి వేశారు. ప్రైవేట్ స్కూల్స్ మూసివేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, చుట్టుగుళ్ళ కిషోర్, జనసేన నాయకులు, పాల్గొన్నారు. **అమలపురం రూరల్‌లో** టిడిపి సీనియర్ నాయకులు పరమట శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం అన్ని విద్యాసంస్థలు,వాణిజ్య వ్యాపార సంస్థలను మూయించారు.అ ధిక సంఖ్యలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, జనసేన నాయకులు పాల్గొన్నారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి తన ఇంటి వద్ద నల్ల జండా కట్టి నిరసన తెలిపారు. చంద్రబాబు అరెస్టును జనసేన అమలాపురం నియోజకవర్గ నాయకులు లింగోలు పండు ఖండించారు. టిడిపి శ్రేణులు ప్రకటించిన బందుకు మద్దతు తెలిపారు. **మండపేటలో** బంద్ కారణంగా వ్యాపార సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, బ్యాంకులు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. బంద్ నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కలవపువ్వు సెంటర్, బస్టాండ్, రాజారత్న సెంటర్ తదితర చోట్ల పోలీసులు భారీగా మోహరించారు. **రామచంద్రపురం** బంద్ ప్రభావం ద్రాక్షారామలో కనిపించలేదు. షాపులు యథావిధిగా పనిచేశాయి. మండలంలో బంద్ కొన్ని ప్రాంతాలకే పరిమితమైంది. పట్టణంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు చంద్రబాబు అరెస్టు నిరసిస్తూ నిరసన ప్రదర్శన చేశారు. సెక్షన్ 30 అమల్లో ఉండటంతో ప్రదర్శనలకు అనుమతి లేదని పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. **అంబాజీపేటలో** వర్షంలోనే టిడిపి, జనసేన శ్రేణులు బంద్ నిర్వహించాయి. టిడిపి మండల అధ్యక్షులు గూడాల ఫణిని పోలీసులు గృహనిర్భందం చేశారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు సెంటర్లలో టిడిపి, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. మాజీ ఎంపిపి డివివి.సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, చిన్నం విజయరావు, అరిగెల సూరిబాబు, ఎన్.వి. సుబ్బారావు, మైపాల తాతాజీ, ఢిల్లీ,టిడిపి జనసేన నాయకులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తంలో** టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, ఆపార్టీ నాయకులు నిరసన తెలిపారు. మండలంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. ఉప్పలగుప్తం, గొల్లవిల్లి, భీమనపల్లి, చల్లపల్లి, ఎస్.యానాం, ఎన్.కొత్తపల్లి ప్రధాన గ్రామాల్లోని వ్యాపార కూడళ్ళలో దుకాణాలు మూతపడ్డాయి. విద్యాసంస్థలు మూతబడ్డాయి. ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

అంబాజీపేటలో వర్షంలోనే నిరసన తెలుపుతున్న టిడిపి, జనసేన నాయకులు

అమలాపురంలో...

మండపేటలో మూతబడిన బ్యాంకు

నిర్బంధంలో ఎంఎల్‌ఎ వేగుళ్ల

నిరసనలపై నిర్బంధం అమానుషం : సిపిఎం

ప్రజాశక్తి - అమలాపురం

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా సోమవారం టిడిపి ఇచ్చిన రాష్ట్ర బంద్ సందర్భంగా అమలాపురంలోనే కాకుండా జిల్లా వ్యాప్తంగా అనేకచోట్ల టిడిపి నాయకుల్ని అరెస్టులు చేశారు. పలువుర్ని గహనిర్బంధంలో ఉంచారు. నిరసన ప్రజాస్వామిక హక్కు, ఈ నిర్బంధాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని ఆ పార్టీ జిల్ల కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. శాంతియుత నిరసనలపై నిర్బంధం ప్రయోగించడం అమానుషమని, అరెస్టు చేసిన వారందరినీ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పలువురి నేతల వేగుళ్ల నిర్బంధం

మండపేట, అమలాపురం : టిడిపి బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో కపిలేశ్వరపురం రోడ్డులోని రథం సెంటర్ వద్ద ఉన్న టిడిపి కార్యాలయంలో ఎంఎల్‌ఎ జోగేశ్వరరావును పోలీసులు నిర్బంధించారు. ఈ సందర్భంగా వేగుళ్ల మాట్లాడుతూ రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగ పాలన జరుగుతుందన్నారు. రాజకీయ కక్ష సాధింపుతోనే చంద్రబాబు నాయుడు అరెస్టు జరిగిందన్నారు. కొత్తపేటలో మాజీ ఎంఎల్‌ఎ బండారు సత్యానందరావును పోలీసులు నిర్భందించారు. పలువురు జనసేన నాయకులను సైతం నిర్బంధించారు. అమలాపురం, అంబాజీపేట, ఆలమూరు, రావులపాలెం, ఆత్రేయపురం మండలాల్లో టిడిపి నాయకులను ముందస్తుగా నిర్బంధించారు.

బాబు అరెస్టు దారుణం : మాథూర్

ప్రజాశక్తి - అమలాపురం

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు దారుణమని టిడిపి అమలాపురం పార్లమెంటరీ ఇన్‌ఛార్జి గంటి హరీష్‌మాథూర్ పేర్కొన్నారు. రాజకీయ కక్ష సాధింపుతో చేసిన ఈ అరెస్టును ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్న తమ నాయకుడికి వస్తున్న ప్రజాధరణ చూసి భయంతోనే తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారన్నారు. ఇన్ని దశాబ్దాల రాజకీయ జీవితంలో ఏనాడూ ఒక మచ్చ కూడా ఎరగని , ప్రజల కోసమే నిరంతరం శ్రమించే నారా చంద్రబాబు నాయుడుని ఇలా అబద్ధపు కేసుల్లో ఇరికించడంతగదన్నారు. చట్టాన్ని ఇలా తన స్వార్ధ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడం రాజ్యాంగాన్ని అవహేళన చేయడమేనన్నారు. ఈ కక్ష సాధింపుల మీద పెట్టిన శ్రద్ధ రాష్ట్ర ప్రయోజనం కోసం పెట్టుంటే రాష్ట్రం ఏనాడో బాగుపడేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు వికాస ఆధ్వర్యంలో

జాబ్ మేళా

ప్రజాశక్తి - అమలాపురం

అమలాపురం కలెక్టరేట్‌లోని వికాస కార్యాలయంలో మంగళవారం జాబ్‌మేళా జరుగుతుందని వికాస జిల్లా మేనేజర్ గొల్ల రమేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేళాలో సుమారు 5 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు ఉపయోగించు కోవాలన్నారు. వివరాలకు www.vikasajobs.com వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో అర్జీల పరిష్కారం

ప్రజాశక్తి - అమలాపురం

అర్జీదారుని సంతృప్తి పరిచేలా పూర్తి నాణ్యతా ప్రమాణాలతో అర్జీల పరిష్కార సరళి ఉండాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా స్థాయి అధికారులు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని గోదావరి భవన్లో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్, జెసి పౌరసర ఫరాల జిల్లా మేనేజర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం 73 అర్జీలను వారు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను ఎటువంటి జాప్యాలకు తావు లేకుండా నిర్ణీత కాలవ్యవధిలో అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించేందుకు సత్వర చర్యలు చేపట్టాల న్నారు. వివిధ శాఖలకు సంబంధించి వచ్చిన అర్జీదారుల సమస్యలపై సానుకూలంగా స్పందించి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల ప్రకారం నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలన్నారు.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతివారం రెండు మండలాల పరిధిలో స్పందన (జగనన్నకు చెబుదాం) నిర్వహించాలని ఆదేశించిందని ఆ మేరకు గత శుక్రవారం రామచంద్రపురం మండలంలో నిర్వహించామన్నారు. ఈనెల 13న కొత్తపేట మండలంలో స్పందన నిర్వహిస్తామన్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా మండలానికి ఒక్కొక్క జూనియర్ అసిస్టెంట్ కం కంప్యూటర్ అసిస్టెంట్ పోస్టు చొప్పున ఎంపికైన 20 మంది అభ్యర్థులకు నియమాకపు పత్రాలను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, జిల్లా అటవీశాఖ అధికారి ఎంవి.ప్రసాద్‌రావు, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్‌ప్రసాద్, మత్స్య శాఖ జెడి షేక్ లాల్ మహ్మద్, సచివాలయం నోడల్ అధికారి కే.భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

ఎంఎల్‌ఎ చిట్టిబాబును కలిసిన ఎంపీ

ప్రజాశక్తి - మామిడికుదురు

అనారోగ్యం కారణంగా హైదరాబాద్ కిమ్స్‌లో అత్యవసర చికిత్స పొందిన అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న పి.గన్నవరం ఎంఎల్‌ఎ కొండేటి చిట్టిబాబును ఎంపీ చింతా అనురాధ సోమవారం కలిసి ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్నారు. పూర్తిగా కోరుకునే వరకు విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఆమె వెంట జడ్‌పిటిసి సభ్యులు కె.అంజిబాబు ఉన్నారు.

బాబుకు బెయిల్ రావాలని బండారు పూజలు

కొత్తపేట : టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు బెయిల్ రావాలని టిడిపి కొత్తపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు సత్యానందరావు వాడపాలెంలోని స్వగహంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బంద్‌లో పాల్గొనకుండా పోలీసులు గృహ నిర్బంధం చేయడంతో ఇంటిలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ బాబుపై అవినీతి మచ్చలు అంటించాలని అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేశారన్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్ని కుట్రలు పన్నినా చివరికి న్యాయమే గెలుస్తుందన్నారు. అవినీతి మరకలు తుడుచుకుని మచ్చలేని చంద్రుడిలా అధినేత తిరిగి వస్తారన్నారు.

రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన

ఐ.పోలవరం : కొమరగిరి గ్రామ పంచాయతీ పరిధిలోని రామారావు పేటలో రామాలయం నిర్మాణానికి ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకటసతీష్‌కుమార్ సోమవారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ వరసాల చాముండేశ్వరి ఆధ్వర్యంలో ఎంపిపి మోర్త రాణిమిరియంజ్యోతి సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. టిటిడి ట్రస్టు బోర్డు ద్వారా రూ.10లక్షలు నిధులను కేటాయించాని ఎంఎల్‌ఎ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతిరాజు, కలిదిండి కృష్ణంరాజు, సఖిలే పద్మావతి, వెంకటేశ్వరరావు, ఏలూరి ఆదినారాయణ, ఈత కొండబాబు,తోట వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

మధుకుమార్‌కు పిహెచ్‌డి

మామిడికుదురు : అప్పనపల్లికి చెందిన బొంతు మధుకుమార్‌కు వ్యాయామ విద్యావిభాగంలో ఆంధ్రా యూనివర్సిటీ పిహెచ్‌డిని అందించింది. వ్యాయామ విద్యా విభాగంలో శరీర కూర్పు, కొవ్వు, అధిక రక్తపోటు, ప్రయివేటు ఉద్యోగుల్లో యోగాసనాల ప్రభావం అనే అంశంపై చేసిన పరిశోధనలకు ఆయనకు డాక్టరేట్ లభించింది. శనివారం జరిగిన స్నాతకోత్సవంలో ఆయన ఈ అవార్డును అందకుఉన్నారు. ఎన్.విజయ్ మోహన్ ఆధ్వర్యంలో ఆయన ఈ పరిశోధన చేశారు.

గుండెపోటుతో విఆర్‌ఎ మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని శివల గ్రామంలో విఆర్‌ఎగా పనిచేస్తున్న చల్లపల్లి వెంకట శ్రీనివాసు అలియాస్ రాజు(58) ఆదివారం గుండెపోటుతో మతి చెందాడని బంధువులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. విఆర్‌ఎ మృతికి తహశీల్దార్ వైద్యనాథ శర్మ, విఆర్ఒల సంఘం నాయకులు సర్పంచ్ అనసూరి సాయిబాబు, వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఇళ్ల సూర్యనారాయణ సంతాపం తెలిపారు.

కాలువలో పడి గేదె మృత్యువాత

ప్రజాశక్తి - రామచంద్రపురం

మండలంలోని వేగాయమ్మపేట వద్ద ప్రమాదవశాత్తు కాలువలో పడి పాడి గేదె మృత్యువాత పడింది. సోమవారం సాయంత్రం రెండు గేదెలు పోట్లాడుకుని కాలువలో పడిపోగా ఒకటి మునిగి చనిపోయింది. కామరెడ్డి వెంకట శ్రీనివాస్‌కి చెందిన ఈ పాడి గేదె రూ.లక్ష రూపాయలు ఉంటుందని తెలిపారు.

కార్టూ'నిజం'

శిథిలావస్థలో రహదారులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సొంత నియోజకవర్గంలో మెయిన్ రోడ్ల దుస్థితి దారుణంగా ఉంది. నాలుగేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళిఅక్కడ అన్నట్లు ఉంది. మూడు నెలలు క్రితం మార్చి 28న స్వయానా మంత్రి చేతుల మీదగా ద్రాక్షారమ, రామచంద్రపురం మెయిన్ రోడ్డుకు కొబ్బరికాయ కొట్టి అట్టహాసంగా పనులు ప్రారంభించారు. మూడు నెలలు గడిచిన మూడు అడుగుల రోడ్డు కూడా వేయకపోవడంతో నియోజకవర్గ ప్రజలు నిత్యం ఈ రోడ్ల దుస్థితిని ప్రశ్నిస్తున్నారు. ఐదేళ్లుగా ద్రాక్షారామ రామచంద్రపురం రోడ్డు ద్రాక్షారామ యానం రోడ్డు, ఆదివారపుపేట, వెల్ల రోడ్డు, పేకేరుబి నల్లచెరువు పుంత రోడ్డు, దంగేరు ,శివల రోడ్లు పూర్తిగా పాడై ఉన్నాయి. ద్రాక్షారామ రాష్ట్ర ప్రసిద్ధిగాంచిన పంచారామ క్షేత్రం భీమేశ్వర స్వామి వారి ఆలయం ఉండటంతో నిత్యం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది ఈ గ్రామానికి రామచంద్రపురం నుండి ద్రాక్షారం ఆరు కిలోమీటర్లు ద్రాక్షారం నుండి యానం 18 కిలోమీటర్లు మేర రోడ్డు పూర్తిగా పాడై ఉంది గత ఏడాది నుండి ఈ రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని చెప్పడమే కానీ పనులు ప్రారంభం కాలేదు. ఈ పరిస్థితుల్లో ఈ ఏడాది మార్చి 28న మంత్రి తన అనుచరులతో పాటు ప్రజాప్రతినిధులతో ద్రాక్షారంలో అట్టహాసంగా రోడ్డు పనులను ప్రారంభించారు వైసిపి నాయకులు అభిమానులు సర్పంచులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మూడు నెలలు గడిచిన ఈ రోడ్డు పనుల్లో జాప్యం చోటు చేసుకుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు ఈ రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. పెద్ద పెద్ద గోతుల్లో పడి పలువురు ప్రమాదాలకు గురవుతుండగా ఇటీవల ప్రమాదాల్లో ప్రాణాలు కూడా కోల్పోయిన సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. మంత్రి సొంత నియోజకవర్గం లోని రోడ్లన్నీ పాడైపోవడంతో పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. మరో ఎనిమిది నెలల్లో పదవులు పూర్తి ఐయిపోయినా, రోడ్డు పనులు మాత్రం పూర్తయ్యాలా లేవని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. అదేవిధంగా ద్రాక్షరామనుండి యానాం రోడ్డును పలుచోట్ల తవ్వి వదిలేయడంతో మరింత ప్రమాద భరితంగా తయారైంది. వర్షాకాలంలో ఈ రోడ్లపై ప్రయాణించాలంటే ధైర్యవంతులకు ఒక సాహసంగా తయారయింది. నిత్యం రోడ్లపై ప్రయాణించే మంత్రి అనుచర గణం నిమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్ల దుస్థితి చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా ఉందని, ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ మెయిన్ రోడ్లను ఆధునికీకరించాలని ద్రాక్షారామ పరిసర ప్రాంతాల ప్రజలు ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.


నీటితో నిండిన ద్రాక్షారామం-రామచంద్రపురం రోడ్డు

గుంతలతో ప్రమాదకరంగా మారిన వైనం
మంత్రి చెల్లుబోయిన వేణు సొంత నియోజకవర్గంలో రోడ్ల దుస్థితి

గంతలతో ప్రమాదకరంగా మారిని దంగేరు-శివల రోడ్డు

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి -రౌతులపూడి

మండలంలోని ఏజెన్సీ ప్రాంతమైన రాఘవపట్నం గ్రామానికి చెందిన ఒక వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపారు. తల్లిదండ్రులు భార్యాభర్తల మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో బాధతో పురుగుల మందు తాగినట్టు వివాహిత తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని తెలిపారు.

చోరీ ఘటనపై ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురంలో శనివారం రాత్రి ఒక దుకాణంలో దొంగతనం జరుగుతుండగా ఒక బాలుని పట్టుకున్నారు. షాపు యజమాని బాలుని పట్టుకుని సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు బాలుని విచారించగా కొంతమంది యువకుల పేర్లు తెలిపాడు. పోలీసుల దొంగతనం జరిగిన సంఘటన ప్రాంతం, యువకులను పిలిచి విచారణ చేపట్టారు.

షాప్‌లోకి దూసుకెళ్లిన కారు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండలం వేట్లపాలెం గ్రామం కెనాల్ రోడ్డులో సోమవారం కారు అదుపుతప్పి పాన్ షాప్‌లోకి దూసుకు వెళ్లిన సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. రాజమండ్రి వైపు నుండి సామర్లకోటకు కెనాల్ రోడ్‌లో కుటుంబంతో సహా ప్రయాణిస్తున్న కారు వేట్లపాలెం గ్రామం వచ్చేసమయానికి అదుపు తప్పి రోడ్డు ప్రక్కన గల పాన్ షాప్ లోకి దూసుకుపోయింది. అక్కడ ఉన్న ఇద్దరికి తీవ్రగాయలు కాగా, రెండు బైకులు పూర్తిగా డామేజ్ అయ్యాయాని స్థానికులు పేర్కొన్నారు. గాయపడిన వ్యక్తులను స్థానికుల సహకారంతో 108 వాహనంలో ఆసుపత్రికి తరలించారు. కారు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సంఘటనపై స్థానకులు పోలీసులకు సమాచారం అందించారు.

ఇంట్లో మందలించారని యువకుని ఆత్మహత్య

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

తల్లిదండ్రులు మందలించారని మనస్తాపానికి గురైై గడ్డి మందు తాగి యువకుడు మృతి చెందిన సంఘటన రాజపూడిలో చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. రాజపూడి గ్రామానికి చెందిన పల్లంశెట్టి శివ సుబ్రహ్మణ్యం(27) భారత్ గ్యాస్ ఏజెన్సీలో పని చేస్తుంటాడు. ఇంట్లో జీతం ఇవ్వకుండా సొంతానికి ఖర్చు పెట్టుకుంటూ ఉండడంతో కుటుంబ సభ్యులు ఇంట్లో జీతం ఇవ్వడం లేదు ఎలా గడుస్తుందని మందలించారు. దీనిపై శివ సుబ్రహ్మణ్యం మనస్తాపం చెంది ఈ నెల 7న జె.కొత్తూరు శివారున ఒక పొలం వద్దకు వెళ్లి గడ్డి మందు తాగినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న అతని స్నేహితులు వైద్య నిమిత్తం జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించినట్లు జగ్గంపేట హెడ్ కానిస్టేబుల్ సూరిబాబు తెలిపారు.

లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు

లోకేష్‌ను కలిసిన టిడిపి నాయకులు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాజమండ్రిలో టిడిపి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిసిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా టిడిపి నాయకులు కలిశారు. ఆయనను కలిసిన వారిలో ఎంఎల్ఎలు నిమ్మకాయల చినరాజప్ప, ఆదిరెడ్డి భవాని, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని తదితరులు ఉన్నారు.

తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదు

ప్రజాశక్తి - తాళ్లరేవు

తప్పు చేస్తే ఎంతటి వారి కైనా శిక్ష తప్పదని వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కుడుపూడి శివన్నారాయణ అన్నారు. సోమవారం మీడియా ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అవినీతికి పాల్పడినందువల్లే చంద్రబాబుకు ప్రభుత్వం శిక్ష విధించిందని, చట్టం తన పని తాను చేసుకుపోతుందని, చట్టానికి ఎవరూ అతీతులు కాదని ఈ అరెస్టుతో నిరూపణ అయ్యిందన్నారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ చంద్రబాబుకు వంత పాడటం మానేసి తన పార్టీ అభివృద్ధికి కృషి చేస్తే ఆదరణ పెరుగుతుందని హితవుపలికారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా పరిపాలన చేస్తున్నారని, దీనివల్ల ప్రజల్లో రోజు రోజుకూ వైసిపి ప్రభుత్వంపై ఆదరణ పెరిగి మళ్లీ జగన్మోహన్ రెడ్డి మళ్లీ సిఎం కావాలని ప్రజలు కాంక్షిస్తున్నారని తెలిపారు.

ఘనంగా నూకాలమ్మ పసర పండుగ

ప్రజాశక్తి-పెద్దాపురం

కాండ్రకోటలో నూకాలమ్మ అమ్మవారి పసర పండగ ఘనంగా నిర్వహించారు. ఏలేరు పరీవాహక ప్రాంతంలో వరి నాట్లు పూర్తయిన సందర్భంలో ప్రజలు పంటలు బాగా పండాలని నూకాలమ్మ అమ్మవారికి పసర పండుగను నిర్వహిస్తారు. ప్రతి కుటుంబం అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. ఆలయ ఆసాదులు అమ్మవారి బుట్టలు తలపై ధరించి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి నైవేద్యాలను స్వీకరిస్తారు.

స్టేషన్ మాస్టర్‌కు ఘన వీడ్కోలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట రైల్వే స్టేషన్ మాస్టర్ ఎస్.గంగా మహేశ్వరుడు బదిలీపై వెడుతున్న సందర్భంగా సోమవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. స్థానిక రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ తన కార్యాలయంలో గంగా మహేశ్వరుడును శాలువాలు, పూలమాలలతో సత్కరించారు.

బైకుల వేలంతో రూ.96 వేల ఆదాయం

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట పోలీస్ స్టేషన్‌లో సోమవారం 56 మోటార్ సైకిల్స్‌ను బహిరంగ వేలంలో కేవలం రూ.96 వేలకు మెకానిక్ బిక్కిన సాయి సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పాటదారులు రింగ్ అయినట్టు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. స్క్రాప్ పద్ధతిన ఈ వేలం జరిగినప్పటికీ 56 బైకుల స్క్రాప్ విలువ లక్షల్లోనే ఉంటుందని పలువురు భావిస్తున్నారు. సుమారు 9 ఏళ్లుగా ఎలాంటి రికార్డులు లేకుండా పట్టుబడిన మోటార్ సైకిళ్లను స్థానిక పోలీసులు సీజ్ చేశారు. వీటిపై యజమానులు ఎవరూ స్పందించని కారణంగా ఎస్‌పి సూచనల మేరకు స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద వేలం నిర్వహించారు. తహశీల్దారు ఎస్.లక్ష్మీనరస కుమారి సమక్షంలో ఎస్ఐ తోట సునీత వేలం నిర్వహించారు. ఈ వేలం పాటలో 12 మంది పాటదారులు పాల్గొన్నారు. ప్రస్తుతం స్క్రాప్ విలువతో వేలం వేస్తున్న వాహనాలు తిరిగి రోడ్లపై తిరిగితే వాటి విషయంలో తమకు సంబంధం ఉండదని ఎస్ఐ సునీత స్పష్టం చేశారు. ఈ వాహనాలకు ఎలాంటి రికార్డులు లేవని, తిరిగి ఇవి రోడ్లపై తిరిగితే మళ్లీ సీజ్ చేస్తామని హెచ్చరించారు.

స్పందన దరఖాస్తులకు పరిష్కారం చూపాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మాధవీలత

స్పందనలో వచ్చిన ప్రతి అర్జీ నిర్ణీత కాలవ్యవధిలో అర్జీదారుడు సంతప్తి చెందే స్థాయిలో అయా శాఖల అధికారులు పరిష్కారం చూపాలని కలెక్టర్ డా. కె.మాధవీ లత ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి పలు అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి 51 అర్జీలను స్వీకరించామన్నారు. స్పందన గ్రీవెన్స్ లను నాణ్యతతో కూడిన విధంగా గడువులోగా పరిష్కరించాలన్నారు. స్పందనలో వచ్చిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి ఏ ఒక్క అర్జీ పెండింగ్, రీ ఓపెన్ కు తావులేకుండా పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 14న సిఎం జగన్మోహన్ రెడ్డి నిడదవోలు పర్యటనను విజయవంతం చేసేందుకు అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెసి తేజ్ భరత్, డిఆర్ఓ జి.నరశింహులు, టూరిజం ఆర్‌డి వి. స్వామినాయుడు, డియంహెచ్ఓ డా. కె.వేంకటేశ్వరరావు, సీపీఓ ఎ. ముఖలింగం, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. మాధవరావు, డిటిఓ ఎన్. సత్యనారాయణ, డిఈఓ ఎస్ అబ్రహం,తదితరులు పాల్గొన్నారు.

40 ఏళ్ల ఇండస్ట్రీ స్కాములు చేసేందుకేనా

ప్రజాశక్తి-అన్నవరం

రాష్ట్రంలో 40 సంవత్సరాలు రాజకీయ ఇండస్ట్రీ అని చెప్పుకుని తిరిగే చంద్రబాబు పరిస్థితిని ప్రజలు గమనిస్తున్నారని ప్రత్తిపాడు ఎంఎల్ఎ పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. సోమవారం అన్నవరం దేవస్థానం కొండపైన పాలకమండలి సమావేశంలో పాల్గొన్న ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో స్కాములు చేశారని, ఆ స్కాములపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా న్యాయస్థానాల్లో స్టేలు తెచ్చుకుంటూ తాను మచ్చలేని చంద్రుని అంటూ ప్రభుత్వంపై బురద జల్లారన్నారు. స్కిల్ డెవలప్మెంట్ స్కామ్‌లో రూ.371 కోట్లు కుంభకోణం జరిగితే ఎఫ్ఐఆర్‌లో తన పేరు లేకుండా పోలీసులు ఎందుకు అరెస్ట్ చేశారని అంటున్నారు గానీ, తాను ఎటువంటి తప్పు చేయలేదని అనడం లేదని వ్యాఖ్యానించారు. అంతేగాక అమరావతిపై పట్టుబడుతున్న చంద్రబాబుకి అక్కడ జరిగిన ల్యాండ్ స్కాం కూడా సంబంధం ఉంది కాబట్టే అక్కడ రైతులని ప్రభుత్వంపై ఉసిగొల్పడం రాష్ట్ర ప్రజలు తెలుసుకున్నారన్నారు.

బొర్ర సుబ్బారాయుడుకు మాతృ వియోగం

ప్రజాశక్తి - కడియం

మండలంలోని కడియపులంక గ్రామానికి చెందిన రంగనాథ నర్సరీ అధినేత, నర్సరీ అసోసియేషన్ మాజీ సెక్రటరీ బొర్ర సుబ్బారాయుడు మాతమూర్తి బొర్ర చక్రరమామణి సోమవారం మతి చెందారు. ఈమె భర్త బొర్ర అప్పారావు తొలితరం నర్సరీ రైతు ప్రముఖులలో ఒకరుగా వెలుగొంది, నేటికీ అధినేతగా ఉన్నారు. ఆమె మతి పట్ల నర్సరీ అసోసియేషన్ అధ్యక్షులు మల్లు పోలరాజు, వ్యవసాయ సలహా కమిటి ఛైర్మన్ ఈలి గోపాలం, మాజీ సర్పంచ్ గట్టి నరసయ్య, నర్సరీ రైతులు ఘనంగా నివాళులు అర్పించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యాన భోజనాల పంపిణీ

ప్రజాశక్తి - తాళ్లరేవు

భోజనాలు వడ్డిస్తున్న లయన్స్ గవర్నర్ వేలూరి

లయన్స్ ఇంటర్నేషనల్ చేసే ఉత్తమ సేవా కార్యక్రమాల్లో నిరుపేదలకు సేవలు చేయడంలో భాగంగా ఫీడ్ ది హంగర్ (ఆకలికి ఆహారం) కార్యక్రమం సుంకరపాలెం జంక్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా వందలాది మందికి భోజనాలు అందించే కార్యక్రమాన్ని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ ప్రారంభించారు. సోమవారం ఈ ప్రాంతంలో పకడ్బందీగా బంద్ జరిగిన నేపథ్యంలో దుకాణాలు, భోజన హోటల్స్ మూసివేయడంతో లయన్స్ క్లబ్ అందించిన అన్నదానంలో అధిక మొత్తంలో పేద ప్రజలు భోజనాలు చేశారు. ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులను పలువురు అభినందించారు. యానం, తాళ్ళరేవు లయన్స్ క్లబ్‌కు చెందిన ప్రతినిధులు స్వయంగా భోజనాలు వడ్డించారు.

విజృంభిస్తున్న సీజనల్ వ్యాధులు

ప్రజాశక్తి - గోపాలపురం

వర్షాకాలంలో వస్తున్న మార్పులతో సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. గత మూడు రోజులుగా జిల్లాను ముసురు వీడకపోవడంతో ప్రజలు దగ్గు, జలుబు, జ్వరాల భారిన పడుతున్నారు. గత వారం రోజుల నుంచి ఇంటికి ఒకరిద్దరు జ్వరాల బారిన పడుతున్నట్లు అంచనా. సామాజిక, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతోపాటు, పిఎంపీలు, ఇతర ప్రైవేటు ఆసుపత్రుల్లో పెరుగుతున్న జ్వరపీడితుల సంఖ్య నిర్ధారిస్తుంది. గ్రామాల్లో అపారిశుద్ధ్యం, నీటినిల్వ ఉండిపోవడంతో దోమల తీవ్రత అధికమైంది. వీటికితోడు వాతావరణంలో మార్పులు, వర్షం, సురక్షిత నీరు లేకపోవడం వంటి కారణాలతో పిల్లల నుంచి వద్ధుల వరకు జలుబు, దగ్గు, జ్వరాలు భారిన పడుతున్నారు. గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో 30 పడకల ఆస్పత్రి జ్వరం బాధితులతో కిక్కిరిసిపోయింది. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న రక్త పరీక్షలు కేంద్రం వద్ద కూడా రోగులు క్యూలు కడుతున్న పరిస్థితి కన్పిస్తోంది. ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తపరీక్షలు ఆలస్యం కావడంతో రోగులు ప్రైవేట్ ల్యాబులను ఆశ్రయించని పరిస్థితి. ఇదే అదునుగా ప్రైవేటు రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు అధిక రుసుంలను వసూలు చేస్తూ రోగులను పీల్చుకుంటున్నారు. కమీషన్ల కక్కుర్తితో కొందరు పిఎంపీల ప్రైవేటు ల్యాబులకే ప్రాధాన్యత ఇవ్వడంతో వారు అడిగినంత ఇవ్వాల్సి వస్తుందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. .సిహెచ్‌సీలకు ప్రతి రోజు కనీసంగా 150 మంది రోగులు వస్తున్నారని, వీరిలో 100 మందికి వైరల్ ఫీవర్లు, టైఫాయిడ్ జ్వరాలతోనే వస్తున్నారని ఆసుపత్రి వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీనిపై సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డా.ఎం.సౌమ్య చైతన్య రాజు మాట్లాడుతూ ప్రస్తుతం టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, ఇతర వైరల్ ఫీవర్లతో వచ్చే రోగులకు ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. జ్వరం వచ్చినట్లు గుర్తించిన వెంటనే ప్రభుత్వాసుపత్రికి రావాలని ఆమె సూచించారు. అలాగే కాచి చల్లార్చిన మంచినీరు మాత్రమే తాగాలని, సురక్షితమైన ఆహారం తీసుకోవాలని తెలిపారు. పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. భోజనం ముందు తర్వాత హ్యాండ్ వాష్ తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని రక్త పరీక్షలు ఉచితంగా చేస్తామని జ్వరం బాధితులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఆసుపత్రిలో రోగులకు భోజనం నిలిపివేత

ప్రజాశక్తి - గోపాలపురం

ప్రభుత్వాసుపత్రిలో రోగులకు ప్రభుత్వం అందించే భోజనంను నిలిపివేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు, గర్భిణీ స్త్రీలకు (డెలివరీ పేషెంట్లకు) ప్రతీ రోజు టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి సమయాల్లో భోజనం సరఫరా చేసేవారు. అయితే రోగులకు భోజనం సరఫరా చేసే కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో గత శుక్రవారం నుంచి భోజనంను రోగులకు అందించడం మానేశారు. దీంతో గత నాలుగు రోజులుగా రోగులకు భోజనం లేక నానావస్థలు పడుతున్నారు. ఈ సందర్భంగా రోగుల బంధువులు మాట్లాడుతూ పలు అనారోగ్య సమస్యలతో, డెలివరీ కేసుల నిమిత్తం దూర ప్రాంతాల నుంచి ఆసుపత్రికి వచ్చామని, ప్రభుత్వం ద్వారా రోగులకు అందించే భోజనం ఎంతగానో ఉపయుక్తంగా ఉండేదని, అయితే భోజనం సరఫరా చేసే కాంట్రాక్టు కార్మికులకు చెల్లించే జీతాలను ఇవ్వకపోవడంతో ఈనెల 8 నుంచి భోజనంను సరఫరా చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రోగుల యోగక్షేమాలను చూసుకునే తాము తినో తినకో ఉండగల్గుతామని, రోగులకు నిర్ణీతమైన సమయానికి భోజనం అందక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతుందని వారు పేర్కొన్నారు. తక్షణమే కాంట్రాక్టు కార్మికులకు జీతాలు చెల్లించి రోగులకు టిఫిన్, భోజనం సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.ఎం.సౌమ్య చైతన్యరాజును వివరణ కోరగా...భోజనం అందించే కాంట్రాక్ట్ కార్మికులకు కేంద్ర ప్రభుత్వం అందించే బిల్లులు వచ్చాయని, రాష్ట్ర ప్రభుత్వం అందించే బిల్లులు రాకపోవడంతో డిసిహెచ్ఎస్ దృష్టికి తీసుకెళ్లామని, అయినప్పటికీ బిల్లులు రాకపోవడంతో శుక్రవారం నుంచి టిఫిన్, భోజనం సరఫరా నిలిచిపోయిందని వివరించారు.

గోపాలపురం ఆసుపత్రిలో రోగులు

ఇఇ మాధవిని సత్కరిస్తున్న కమిషనర్, సిబ్బంది

ఇఇ మాధవికి ఘన సత్కారం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరపాలక సంస్థలో డిఇగా పని చేస్తూ ప్రమోషన్‌పై ఇఇగా వెళుతున్న ఎంవికె.మాధవిని కార్పొరేషన్ యంత్రాంగం సోమవారం ఘనంగా సత్కరించింది. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఇఇ మాధవిని నగరపాలక సంస్థ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, ఇతర అధికారులు మాట్లాడుతూ విధి నిర్వహణలో మాధవి ఎంతో సమర్థవంతంగా పని చేశారన్నారు. ఇక్కడే ఆమెకు పదోన్నతి లభించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, ఎంహెచ్ఓ డాక్టర్ పథ్వీ చరణ్, డిసిపి హరిదాస్, ఎసిపి నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టివి.శిరీల్ పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చంద్రబాబుకు త్వరగా బెయిల్ మంజూరు కావాలని కోరుతూ 12వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తుమ్మల సునీత ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక నూకాలమ్మ అమ్మవారి ఆలయంలో అమ్మవారిని దర్శించి, కొబ్బరికాయలు కొట్టి ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా తుమ్మల సునీత మాట్లాడుతూ 75 ఏళ్ల వయసులో కూడా అహర్నిశలు ఆంధ్రరాష్ట్ర ప్రజల కోసం పరితపించే చంద్రబాబునాయుడు వంటి వ్యక్తిపై జగన్మోహన్ రెడ్డి తప్పుడు కేసులు పెట్టి కక్షసాధింపు చర్యలకు పాల్పడటం దారుణమని అన్నారు. చంద్రబాబునాయుడు, లోకేష్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర అభివద్ధిని పట్టించుకోకుండా తన మనుగడ కోసం ఎప్పుడూ చంద్రబాబుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు.

ఆర్‌డిఒ స్పందనకు 5 అర్జీలు

పెద్దాపురం : స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన స్థాయి స్పందనలో సమస్యలు పరిష్కారం కోరుతూ 5 అర్జీలు అందాయని ఆర్‌డి జె.సీతారామారావు తెలిపారు. ఆక్రమణలు తొలగించాలని, భూమి సర్వే చేయించాలని, సరిహద్దు తగాదాలు పరిష్కరించాలని తదితర అంశాలపై అర్జీలు అందజేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయం ఎఒ వెంకటలక్ష్మి, డిఎల్‌పిఒ బాలామణి, ఎడిఎ దైవకుమార్, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి, డిటి భాను కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పంతం నానాజీ పుట్టినరోజు

కరప : జనసేన పార్టీ కాకినాడ రూరల్ ఇన్‌ఛార్జి పంతం నానాజీ పుట్టిన రోజు వేడుకలను బోగిరెడ్డి కొండబాబు ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. భోగి రెడ్డి కొండబాబు , హరినాథ్, యాళ్ల వీర వెంకట సత్యనారాయణ, కరపమండల ఉపాధ్యక్షులు సైనవరపు భవాని శంకర్, పేపకాయలు పవన్ కుమార్, గొల్లపల్లి చంద్రశేఖర్, పెంకే దుర్గాప్రసాద్, నక్కా అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాబు అరెస్టు ప్రభుత్వానికి సంబంధం లేదు

నల్లజర్ల : స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం గుట్టు రహస్యం పూణేలో పుట్టిందని, సంబంధిత సొమ్ముకు జిఎస్‌టి ఎగవేత కారణంగా విషయం బయటకు వచ్చిందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సిఎంకు సంబంధం లేదని మాజీ జడ్‌పిటిసి సభ్యులు వెల్లంకి సుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక సొసైటీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వమే ఈ స్కాంపై అత్యంత గోప్యంగా దర్యాప్తు చేయించిందని, అయితే రాష్ట్ర ప్రజల దృష్టి మరల్చేందుకు టిడిపి రాష్ట్ర ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. ఏలేరు కుంభకోణం దగ్గర నుంచి 26 కేసుల్లో స్టేలు తెచ్చుకుని నిప్పు అంటే ఎలా అని ప్రశ్నించారు.

వేలివెన్నులో విదార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని వేలివెన్ను ప్రైవేటు విద్యా సంస్థల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న ఘంటా వంశి (16) హాస్టల్ గదిలో ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. ఈ నెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు హాస్టల్‌కు సెలవలు ఇవ్వగా, స్వగ్రామం అనకాపల్లి వెళ్ళిన వంశీని మధ్యాహ్నం తండ్రి అప్పలకొండ హాస్టల్లో దింపి వెళ్లిన 2 గంటల్లోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బాలుని మృతిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కె.రామారావు తెలిపారు.

ఘనంగా మిథున్ రెడ్డి పుట్టిన రోజు

గోకవరం : గోకవరంలో ఉభయగోదావరి జిల్లాల ఎస్‌సి సెల్ జోనల్ ఇన్‌ఛార్జ్ గుల్లా ఏడుకొండలు ఆధ్వర్యంలో రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపి పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏడుకొండలు మాట్లాడుతూ యువనేతగా సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన మిథున్ రెడ్డి పార్లమెంట్లో శక్తివంతమైన నేతగా అద్భుతంగా పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గునిపే ఏడుకొండలు, వైసిపి నాయకులు ఇజ్జిన కిరణ్ కుమార్, పత్తి రమేష్, మనోహర్ దాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

యానాం వార్తలు

20న పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి 15వ అసెంబ్లీ సమావేశం ఈ నెల 20న నిర్వహిస్తున్నట్లు అసెంబ్లీ కార్యదర్శి జె.దయాలన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోజు ఉదయం 9.30 నుంచి లెజిస్లేటివ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమవు తాయన్నారు. ఎల్‌జి తమిళసై సౌందరరాజన్, సిఎం రంగసామి తదితరులు హాజరవుతారన్నారు.



నివాళులర్పిస్తున్న ఆర్‌ఎఒ మునిస్వామి ఇతరులు

సుబ్రహ్మణ్య భారతికి ఘన నివాళి

ప్రజాశక్తి - యానాం

మహాకవి సుబ్రహ్మణ్య భారతి వర్ధంతిని సోమవారం సమాచార శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రాజీవ్ బీచ్ రోడ్డులో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్‌ఎఒ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కొల్లు ప్రసాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

ధర్నాచౌక్‌ను పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చౌక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు సోమవారం గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కోరారు. ఉప్పుటేరు రోడ్డుకు మార్చిన ధర్నా చౌక్ వల్ల సామాన్యులు తీవ్ర అవస్థలు పడుతున్నారని తెలిపారు. రోడ్డు మీద ధర్నా ప్రదేశం కేటాయించడం వల్ల ట్రాఫిక్‌కు ఆటంకంగా ఉందన్నారు. అక్కడి కార్ల యజమానులు, డ్రైవర్లు, క్లీనర్లు, ఇటుక, తాటాకు అమ్ముకునే వారు, స్ట్రీట్ వెండర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కలెక్టర్, ఎస్‌పి ఆధ్వర్యాన అన్ని రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు.

ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది

నేను నడింపల్లి విజయ రామకృష్ణ చైతన్య కుమార్, తండ్రి: రమేష్ రాజు, గోడి లంక, అల్లవరం మండలం, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అను నా పేరున ఉన్న పాస్‌పోర్టు నెం. **H5819751 గల ఒరిజినల్ పాస్ పోర్టు** జిరాక్స్ తీయించుటకు షాపుకు వెళ్తుండగా పోయినది. దొరికిన వారు ఈ చిరునామాకు అందించగలరు.

నడింపల్లి విజయ రామకృష్ణ చైతన్య కుమార్
తండ్రి: రమేష్ రాజు, గోడిలంక, అల్లవరం మండలం,
డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.
సెల్: 95053 18333

మహారాజశ్రీ ఏలూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఏలూరు వారి కోర్టులో
F.D.P.No. 5/2023 in O.S.No. 419/2017
మధ్య:
శ్రీమతి సమయం చక్రమ్మ ...పిటీషనరు /వాది
అండ్
1) తూము మంగతాయారు
2) తూము వెంకటబాలాజీ
3) కాకిత పుణ్యవతి
4) తూము అయ్యప్ప ...రెస్పాండెంట్లు /ప్రతివాదులు

టు: తూము అయ్యప్ప, తండ్రి: లేటు సుబ్రహ్మణ్యం, డో.నెం. 3-213, టి.వేమవరం రోడ్డు, పాలంగి గ్రామం, ఉండ్రాజవరం మండలం, తూర్పు గోదావరి జిల్లా (పూర్వపు పశ్చిమ గోదావరి జిల్లా)

ది.24-08-2023న శ్రీ కోర్టు వారు జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం పై ఎఫ్.డి.పి. గ్రంధము **ది.25-09-2023కు వాయిదా అయి ఉన్నది.** ఈ విషయమై మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నచో స్వయంగా గాని, మీచే నియమింపబడిన ప్లీడరు గారి ద్వారా గాని కోర్టు ప్రాంగణములో యున్న లీగల్ సర్వీసు వారి సహాయం పొంది గాని, శ్రీ కోర్టు వారి ముందు ది.25-09-2023న ఉదయం 10 గంటలకు హాజరయ్యి తెలుపుకోవలసినదిగా ఆర్డరు చేసియున్నారు. కానిచో సదరు విషయము మీ పరోక్షమున శ్రీ కోర్టు వారు తీర్మానించుట జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

శియ్యాద్రి జగదీశ్వరరావు
ఏలూరు, **వానపల్లి అప్పారావు**
11-9-23. న్యాయవాదులు, ఏలూరు.
సెల్: 8956899999, 9440309669

మహారాజశ్రీ కొవ్వూరు 1st Addl. జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S. No. 158/2023
Between:
వాద్లు:
1) శ్రీమతి కొప్పిశెట్టి రవిచంద్రిక, W/o. వెంకట సూర్యప్రసాదు, హిందూ, వయస్సు 46 సం॥లు, స్త్రీ, హౌస్ వైఫ్, డో.నెం. 14-125/3, సత్యనారాయణపురం, రాజమండ్రి రూరల్, తూ॥గో॥జిల్లా, RJY JCJC.
2) శ్రీ కొప్పిశెట్టి గౌతమ్ సాయి, S/o. వెంకట సూర్యప్రసాద్, హిందూ, వయస్సు 23 సం॥లు, పురుషుడు, డో.నెం. 14-125/3, సత్యనారాయణపురం, రాజమండ్రి రూరల్, తూ॥గో॥జిల్లా, RJY JCJC.
3) కుమారి కొప్పిశెట్టి నాగ చార్వి, D/o. వెంకట సూర్యప్రసాద్, హిందూ, వయస్సు 23 సం॥లు, పురుషుడు, డో.నెం. 14-125/3, సత్యనారాయణపురం, రాజమండ్రి రూరల్, తూ॥గో॥జిల్లా, RJY JCJC.
The Plaintiffs 1 to 3 being rep. by Power of Attorney Sri Koppisetti Durga Prasad, S/o. late Satyanarayana, D.No. 14-125/3, Rajahmundry, RJY Rural, E.G.Dist., RJY JCJC.
ప్రతివాద్లు:
1) శ్రీ మద్దిపాటి కృష్ణ, S/o. సుబ్బారావు, వయస్సు 75 సం॥లు, హిందూ, పురుషుడు, Old age Pensioner, డో.నెం. 3-190, తోగుమ్మి, కొవ్వూరు మండలం, తూ॥గో॥జిల్లా, KJCJC.
2) The Thasildar, Kovvur Mandal, Kovur, E.G.Dt., KJCJC.
3) The Revenue Divisional Officer, Kovvur Revenue Division, Kovvur, E.G.Dt., KJCJC.
4) The District Registrar, Assurances, Rajahmundry, E.G.Dt., RJY JCJC.
5) The Sub Registrar, Sub Registrar Office, Kovvur, E.G.Dt., KJCJC.
6) The District Collector, East Godavari District, Rajahmundry, E.G.Dt., RJY JCJC.

యీ నెంబరులో 1వ ప్రతివాది I.A. 415/2023 లో 1వ రెస్పాండెంటుకు దావా సమను/ మరియూ I.A. నోటీసు కోర్టు ద్వారాను మరియు రిజిష్టర్డు పోస్టు ద్వారాను అనేక పర్యాయములు పంపించినను అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం యీ ప్రకటన వేయడమైనది.

యీ నెంబరులో 1వ ప్రతివాది మరియు I.A. 415/2023, 1వ రెస్పాండెంటు అయిన శ్రీమతి మద్దిపాటి కృష్ణ, S/o. సుబ్బారావు, తోగుమ్మి అనువారు **ది. 25-9-2023వ తేదీ ఉదయం గం॥ 10.30 లకు** శ్రీ కోర్టు వారు పిలిపించే టైముకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియపరచుకొనవలెను. లేని యెడల Expartee చేసి పరోక్షమున తీర్మానించడమగును.

వాయిదా: 25-9-2023
CH.NAGA KUMAR
Kovvur Advocate, Kovvur
04-9-2023 Cell: 9440985149

IN THE HIGH COURT OF ANDHRA PRADESH AT : AMARAVATHI
A.S.NO. 123 of 2021
Between : .
Sri Bobba Ratna Sekhar, S/o. B.Ramesh Babu, R/o. Mustabad village Gannavaram Mandal, Krishna District.
... Petitioner/Appellant
AND
M/s. BHARGAV REAL CON PVT LTD.,
...Respondent
TO
M/S. BHARGAV REAL CON PVT LTD., having its registered office at 29-37-138. 2nd floor, Canara Bank Building, Eluru Road,Vijayawada-520002, Rep.by its Managing Director.

NOTICE

Itis hereby informed that Sri Bobba Ratna Sekhar, S/o. B.Ramesh Babu, R/o. Mustabad village Gannavaram Mandal,Krishna District., has filed A.S.123/2021 on the file of the Hon'ble High court of A.P., Amaravathi questioning the judgment and decree dated 01.12.2019 passed in O.S. No.3/2013 on the file of 2nd Addl.District Judge, Amalapuram, .East Godavari District.

The Hon'ble High Court has permitted the appellant to take out substituted service of notice to the Respondent i.e., M/s. Bhargav Real Con Pvt. Ltd., by way of paper publication.

Therefore, please take notice that you M/s. Bhargav Real Con Pvt. may appear before the Hon'ble High Court of Andhra Pradesh in A.S.No.123/2021 either personally or through an Advocate as otherwise the Hon'ble High Court will proceed with hearing of the Appeal by setting you exparte.

(By order of Hon'ble Court)
R.K.ACHARYULU
Counsel for the Appellant
Amaravathi,